

# శ్వేత పత్రం

-చంద్రలత

అపర్ణ మంచంలో తడిసిన పచ్చిక మీద నిలబడి చుట్టూ చూసింది. రంగు రంగుల సీతాకోకచిలుకలు అపర్ణను పలకరిస్తూ గాలిలో పల్టీలు వేస్తున్నాయి. అపర్ణ కిందికి వంగి, గడ్డిలో ఒదిగి వున్న చిన్ని చిన్ని పువ్వులను ఆప్యాయంగా తడిమింది. అకస్మాత్తుగా అపర్ణ చుట్టూ ఇనుపగోడలు ప్రత్యక్షమయ్యాయి. వాటి తుప్పువాసన అపర్ణను అయోమయంలో పడేసింది. పైకిలేచి పరిగెత్తాలని ప్రయత్నించింది.

అడ్డంగా అడుగున్నర అమీబా ఒకటి ప్రత్యక్షమయింది. అది ఆశ్చర్యంతో నిలబడిపోయిన అపర్ణలోంచి దూసుకొంటూ చీలిపోతోంది. ఒకటి రెండుగా, రెండు నాలుగుగా....

మరో వైపు నుంచి చెయ్యెత్తు హైడ్రాలు పల్టీలు వేసుకొంటూ దగ్గరకు వస్తున్నాయి.

అపర్ణ బిత్తరపోయి అటూ ఇటూ చూసింది.

ఏదో విషపు చెట్టు ఊడలు చాచి అపర్ణను చుట్టేయడానికి ప్రయత్నిస్తోంది. ఇంకేదో అపర్ణ కాళ్ళను చుట్టుకొని బలంగా కిందికి లాగింది.

అపర్ణ నోరు తడారి పోయింది. ఒళ్ళంతా చెమట్లు పట్టాయి. భయంతో కంపించసాగింది.

ఇంతలో ఆ తుప్పు ఇనుపగోడల మీద ఖాళీ రేకుడబ్బా బోర్లించి, తడుతోన్న శబ్దం వినిపించింది.

ఆ శబ్దం సన్నగా మొదలయ్యి, గట్టిగా, భయంకరంగా, చెవులు చిల్లులు పడేలా అన్నీ వైపుల నుంచి ఏకబిగిన వస్తోంది.

అపర్ణ నిస్సహాయంగా, ఆఖరి ప్రయత్నంగా గొంతు చించుకొని బిగ్గరగా అరిచింది.

"ఏంటే తెల్లగా తెల్లారాక నీ కలవరింతలు? ఒళ్ళంతా ఆ చెమట్లేమిటి? కలేమయినా వచ్చిందా?" అపర్ణను పట్టి కుదుపుతూ అంది బిందు.

అపర్ణ ఉలిక్కిపడి లేచింది. అయోమయంగా చుట్టూ చూసింది.

"ఆ లంకిణీ ఇప్పటికే రెండుసార్లొచ్చి వెళ్ళింది. మళ్ళీ వచ్చే లోపల లేస్తావో లేదోనని హడలి చచ్చాను. ఇంకా లోకంలో పడినట్లులేవు. లేచి కాస్త మొహం కడుక్కోరాదూ?" అంటూ బిందు అపర్ణ చేయిపట్టి మంచం మీద నుంచి పైకి లేపింది.

అపర్ణ మొహం కడుక్కొని గదిలోకి వచ్చింది.

ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. ఒకరి గురించి ఒకరు పట్టించుకొనే స్థితిలో లేరు.

"నీకేవిటే బాబూ మహారాణిలా నిద్రపోతావు! నీవెప్పుడు లేస్తావా అని ఎదురు చూస్తున్నాన్నేను." అంది తులసి అపర్ణ దగ్గరకి వస్తూ.

"దేనికి?" అపర్ణ ఆశ్చర్యంగా అడిగింది.

"ఏముందీ? మళ్ళీ ఏదో డౌటు వచ్చి వుంటుంది. వట్టి సందేహప్రాణి! ఇక పరీక్షెలా వెలగబెట్టుందో!" బిందు మెల్లిగా అంది.

"ఏంటే బిందూ అపర్ణ చెవులు కొరుకుతున్నావ్? అపర్ణా... ఒక్క నిమిషంలో వస్తాను. దాని మాటలు పట్టించుకోమాకే బాబూ" అరుస్తున్నట్లుగా అపర్ణకు చెప్పి బాత్‌రూంలోకి పరుగు తీసింది తులసి.

బోర్లించిన గ్లాసుతో రేకు తలుపు మీద తడుతోన్న శబ్దం సన్నగా మొదలయి క్రమంగా వీరి దగ్గరకి వస్తోంది.

"అమ్మో లంకిణి వస్తోంది!" బిందు గబుక్కున పుస్తకం చేతిలోకి తీసుకొని, మంచం మీదికి గెంతింది.

తనను అంతకు మునుపు అంతగా భయపెట్టిన ఆ శబ్దం తన దగ్గరవుతూంటే అపర్ణకు నవ్వొచ్చింది.

అది చిరపరిచితమైన శబ్దమే!

ఖాళీ కిరసనాయిలు డబ్బాలో కంకరరాళ్ళు పోసి ఆడిస్తున్నట్లు దడదడలాడిస్తూ, అరుస్తూ అందర్నీ హడలెత్తించడం ఆవిడకు అలవాటు.

"ఏం అమ్మాయిలూ అందరూ లేచారా లేదా? అనలివాళ పరీక్ష ఉందనుకొంటున్నారా? ఏయ్ ఆశా! లే! చదువుతున్నావా? కలలు కంటున్నావా? మంచాల మీదపడి దొర్లడానికి ఇక్కడికెందుకు వచ్చారు తల్లీ మీరు?" మంచం మీద బోర్లా పడుకొని చదువుకొంటోన్న ఆశని చేయిపట్టి విసురుగా లాగింది ఆవిడ.

ఆశ బిత్తరపోయి లేచి నిల్చుంది.

"ఒక్కొక్కళ్ళూ అడ్డగాడిదల్లా తయారయ్యారు. మా ప్రాణాలకి తగలడ్డారు!" గొణిగినట్టుగా అంది ఆవిడ.

ఆశ కళ్ళల్లో నీళ్ళూరాయి. ఆవిడ చేయిపట్టి లాగిన చోట మెల్లిగా నవరించుకొంది.

బిందు ఆవిడతో ఏదో చెప్పబోయింది.

"నీ సంగతి ఏంటి?" బిందు మీది మీదికి వస్తూ కటువుగా అంది ఆవిడ.

"గుడ్ మానింగ్ మేడం!" బిందు తలకిందికి వంచి, నెమ్మదిగా అంది. ఆమె విసురుగా అందరి వంకా చూసింది. అందరూ పుస్తకాలలోకి తల దూర్చారు. ఆవిడ అపర్ణ దగ్గరకి వచ్చి, మృదువుగా అడిగింది. "ఏమ్మా! రాత్రి బాగా చదువుకున్నావా? లేచేసరికి ఆలస్యమయిందే?"

అపర్ణ సమాధానం చెప్పేలోగా, ఆవిడ మళ్ళీ అంది. "మీ అమ్మ ఇందాక ఫోన్ చేసారు. నిన్ను పరీక్ష మీద మనసు లగ్నం చేయమన్నారు. బెస్టవిషెస్ చెప్పమన్నారు."

"థ్యాంక్ యూ మేడం!"

ఆమె మొహం మళ్ళీ కఠినంగా మారింది. విసవిసా నడుస్తూ బయటకు వెళ్ళింది.

"గుడ్ మానింగ్ మేడం!" అందరూ ఒక్కసారిగా బిందుని వెక్కిరించారు.

"అది సరే కానీ! ఏంటే అపర్ణా, ఆ లంకిణి నీతో అంత సౌమ్యంగా మాట్లాడిందివాళ?" బిందు ఆసక్తిగా అడిగింది.

తెలీదన్నట్లు భుజాలెగరేసింది అపర్ణ.

"ఏవిటే బాబూ! అందరూ ఒహటే మాటాడేసుకుంటున్నారు. బాత్‌రూంలోకి సరిగ్గా వినబడి చావలేదు. అపర్ణా, ఓ చిన్న డౌటుంది. పుస్తకం తీసుకొస్తాను. బాత్‌రూంలోకి దూరమాకే బాబూ!" బతిమిలాడుతున్నట్లుగా అని, ఉతికి తెచ్చుకొన్న బట్టలు ఆరేసుకోవడానికి గదిలో ఓ మూలగా కట్టుకున్న తాడు దగ్గరకి హడావుడిగా వెళ్ళింది తులసి.

బిందు బట్టలు తీసుకొని, స్నానానికి వెళ్ళింది. అందరూ హడావుడిలో పడ్డారు. అపర్ణ మంచం మీద దుప్పటిని దులిపి, సరిగ్గా వేసింది. బద్ధకంగా ఆవులించి, అందర్నీ గమనిస్తూ మంచం మీద కూర్చుంది.

పుస్తకాలు సర్దుకొంటోన్న ఆశ, ఇంకా వెక్కుతూనే వుంది.

"నా పెన్నెవరు తీసుకొన్నారో త్వరగా ఇచ్చేయండి."

"కాస్త జుట్టుకి రబ్బర్ బాండ్ వేయవే బాబూ"

"నా బోటనీ రికార్డు నీ పుస్తకాల్లో కలిసిందా?"

"నీ నల్ల చున్నీ నేను వేసుకొంటున్నానోచ్!"

తనూ అందరితో పాటు ఇలాగే సందడి చేసేది రోజూ. మరి ఈ రోజెందుకో వీళ్ళని గమనిస్తూ వుంటే తమాషాగా వుంది. అపర్ణ మొహాన చిరునవ్వు మెరిసింది.

"ఫొటోసింథసిస్‌లో క్లోరోఫాం ఎవాల్యుయేషన్ చెప్పవే బాబూ కాస్త." తులసి వెళ్ళినంత హడావుడిగా వచ్చింది.

అపర్ణ తలెత్తి చూసి, నవ్వుతూ అంది," క్లోరోఫాం కాదే క్లోరోఫిల్!"

"దీనికింకా నిద్రమత్తు వదిలినట్టు లేదు, క్లోరోఫాం అంటూ కలవరిస్తోంది!" వెక్కిరిస్తూ అంది బిందు.

"చాల్లేవే నీ వేళాకోళాలు! ఏదో ఒహటి! మా నాన్న మాతృభాషలో విద్యాబోధన అంటూ పదో తరగతిదాకా తెలుగు మీడియంలో చదివించారు. చిన్నప్పటి నుంచీ నేనెరిగిన కిరణజన్య సంయోగ క్రియ, పత్రహరితం కాస్తా కొత్త పేర్లతో ప్రత్యక్షమై కూర్చున్నాయి. మరి ఆ మాత్రం కన్‌ఫ్యూజన్ వుండదా?" ఉక్రోషంగా అంది తులసి.

. "టేకిట్ ఈజీ తులసీ" అపర్ణ తులసిని తనవైపు తిప్పుకొంటూ అంది.

బిందు మౌనంగా అక్కడి నుంచి లేచి వెళ్ళింది.

అపర్ణ యాంత్రికంగా తులసి సందేహాలకు సమాధానాలిచ్చింది.

అందరి తల్లిదండ్రులూ పిల్లల చదువు విషయంలో ఒకలాగానే ప్రవర్తిస్తారా? అంతిమ నిర్ణయాలు వాళ్ళే తీసుకొంటారా? ఇన్నాళ్ళూ అమ్మానాన్నే ననుకొంది. అలాంటి వాళ్ళు చాలామందే వున్నారన్నమాట! అపర్ణ నిట్టూర్చింది. అమ్మానాన్నతో తన సంభాషణ ఇప్పుడే జరుగుతున్నట్టుగా అనిపించింది.

* * * *

"డాడీ, సమోసాలు నేను చేస్తే ఎలా వున్నాయో చెప్పు." అపర్ణ ఉత్సాహంగా శ్రీనాథ్ చేతికి ప్లేటు అందించింది.

"ఊ.... ఎక్సెలెంట్!"

సుధ ఉస్సురంటూ వచ్చి వీరి పక్కన కూర్చుంది. చేతిలోని స్టైత్‌ని టీపాయి మీద పెట్టింది. అపర్ణ సుధ చేతికి సమోసాల ప్లేటు అందించింది.

సుధ శ్రీనాథ్‌తో అంది, "ఇందాకటి కేసికి సిజేరియన్ చేద్దామనుకొంటున్నాను. మీరు పేషెంట్‌ని ప్రిపేర్ చేసేలోపల కాస్త రిలాక్సవుదామని వచ్చాను. త్వరగా హాస్పిటల్‌కి వెళ్ళాలి శ్రీనాథ్."

శ్రీనాథ్ మౌనంగా లేచి, డ్రస్ మార్చుకోవడానికి లోపలికి వెళ్ళాడు.

సుధ ఇంటర్‌కాంలో జూనియర్ డాక్టర్‌తో మాట్లాడింది. అపర్ణ అందించిన టీ తాగి, సోఫాలో వెనక్కు వాలి, కూర్చుంది.

"మమ్మీ నువ్విప్పుడు వెంటనే వెళ్ళాలా?"

"ఆ...! సరేకానీ, నువ్వు సామానదీ ప్యాక్ చేసుకొంటున్నావా లేదా? నీకింకా ఏమైనా కావలిస్తే నాకు కాస్త తీరిక దొరకగానే షాపింగ్‌కి వెళదాం."

"ప్యాకింగ్ దేనికి మమ్మీ?" అపర్ణ ఆశ్చర్యంగా అడిగింది.

"మీ డాడీ చెప్పలేదా? నీతో స్వయంగా ఆయనే మాట్లాడతానన్నారే! మొన్న మీ డాడీ ఫ్రెండొకాయన వచ్చి కలిసాడు. ఆయన ఓ రెసిడెన్షియల్ కాలేజ్ రన్ చేస్తున్నాడట. నిన్నక్కడ చేర్పించమన్నాడు. ఫామ్స్ అవీ కూడా అతనే ఫిలప్ చేసాడు."

"అక్కడికి ఎందుకు మమ్మీ?" సుధ మాటలకు అడ్డొస్తూ అంది అపర్ణ.

"చెప్పేది కాస్త విను. ఆ తరువాత మాట్లాడు" కటువుగా అంది సుధ,

"నిన్ను ఇంటెన్సివ్ కోచింగ్ వాళ్ళతో కలిపి చదివిస్తారుట, స్టేట్‌ఫస్ట్ వచ్చేట్టుగా! వాళ్ళకి మామూలుగా ముప్పై నలభై వేలు వసూలు చేస్తారుట. నీకు ఫీజులేదు. పైపెచ్చు హాస్టల్, మెస్ ఫ్రీ."

"నా మీద అంత శ్రద్ధ దేనికి?" అపర్ణ ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు టెన్త్‌లో స్టేట్ ర్యాంక్ వచ్చిందిగా!"

"అయితే ఇదంతా వాళ్ళ కాలేజికి స్టేట్ ర్యాంక్ తెచ్చిపెట్టడానికి పెట్టే పెట్టుబడి అన్నమాట!" వ్యంగ్యంగా అంది అపర్ణ.

"నీవేమయినా అనుకో!"

"అయినా, నా అప్లికేషన్ ఫాం నాకు తెలీకుండా ఎలా ఫిలప్ చేసారు? ఏ గ్రూప్ అని రాసారు?"

"ఏ గ్రూప్ రాస్తారూ? బై.పి.సి.యే!"

"నేను మెడిసిన్ చదవను."

"చదవకపోతే ఏం చేస్తావ్? ఇలా వంటావార్పు చేసి, అంట్లు తోముకుంటూ కూర్చుంటావా?" చేతిలోని ప్లేటు విసురుగా టీపాయి మీద పెడుతూ, హేళనగా అంది సుధ.

"వంట చేయడం గురించి అంత తేలిగ్గా మాట్లాడతావే? అది ఎంత అద్భుతమైన కళో నీకు మాత్రం తెలీదూ?" చురుగ్గా చూసింది అపర్ణ.

"అయితే?"

"నేను మ్యాత్స్ తీసుకొంటాను." అపర్ణ గొంతు స్థిరంగా పలికింది.

"మ్యాథ్స్ తీసుకొని ఎవరిని ఉద్ధరిద్దామని? మెడిసిన్ చదివితే అవంతి, నువ్వూ కలిసి ఈ ఆసుపత్రిని బాగా డెవలప్ చేయచ్చు."

"ఆ పనేదో అవంతిని చేయమను. నేను చేయను. నాకు ఇంట్రస్ట్ లేదు."

"ఏమిటీ నీ బోడి ఇంట్రెస్ట్? నీకు సైన్స్‌లో నైన్టీ ఎటౌ వచ్చాయికదా అని మేం సంతోషిస్తుంటే....."

"మ్యాథ్స్‌లో సెంట్ పెర్సెంట్ వచ్చాయి." సుధని మాట్లాడనివ్వకుండా అంది అపర్ణ.

"అవంతి ఇలాగే వాదించిందా? చిన్నదానివని చనువిస్తే ఇష్టమొచ్చినట్లు వాగుతున్నావే?"

"అవంతక్క ఇష్టం అవంతక్కది. నా ఇష్టం నాది."

"ఆరిందా లాగా మాట్లాడకు. నీ గురించి నీవు నిర్ణయాలు తీసుకొనే వయసు నీకింకా రాలేదు. నోర్మూసుకొని చెప్పినట్లు విను. ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాయి. వచ్చే సోమవారం నువ్వు హాస్టల్‌కి వెళ్ళాలి."

"అక్కడికి వెళ్ళి వుండాల్సిన అవసరం ఏముంది మమ్మీ? అక్కడ ఎంత వరస్టగా వుంటుందో అవంతక్క చెప్పలేదూ? ఎలా చదువుకోవాలో, ఎప్పుడు చదువుకోవాలో చివరికి ఏ పొజిషన్‌లో కూర్చుని చదువుకోవాలో అంతా వాళ్ళ ఇష్టమేనట కదా!"

"అది ఏమోగానీ, నీకు స్టేట్‌ఫస్ట్ తప్పక వచ్చేట్టుగా చూస్తానని అతను చెప్పాడు." నెమ్మదిగా అంది సుధ.

"నేను గానుగెద్దులా చదివిందే చదివి, రాసిందే రాయలేను. కొరడాలు ఝుళిపించే రింగ్ మాస్టార్లుగా వ్యవహరించే వారి దగ్గర నేను ఇమడలేను. నేను చదివే చదువులో నాకు పూర్తి స్వేచ్ఛ కావాలి."

"ఇంతవరకూ వాగడానికి ఇచ్చిన స్వేచ్ఛ చాలు! పెద్దవాళ్ళ మాట వినడం నేర్చుకో!" సుధ అసహనంగా అరిచింది.

"ఏమిటీ తల్లీ కూతుళ్ళిద్దరూ వాదనలలోకి దిగారు?" శ్రీనాథ్ టక్ చేసిన షర్టు సరిచేసుకొంటూ వచ్చాడు.

"ఏముందీ? అపర్ణ బైపిసి తీసుకోదట! హాస్టల్లో వుండదట!"

శ్రీనాథ్ అపర్ణవైపు తిరిగాడు. అపర్ణ ఏదో చెప్పబోయింది.

"అపర్ణా, నీతో మీ అమ్మని తిరిగ్గా వాదించమను. నా నిర్ణయం విను. నీ గ్రూప్ సెలక్షన్ అయిపోయింది! నీవు హాస్టల్‌కే వెళుతున్నావు! ఇక ఈ విషయం మీద చర్చించడం అనవసరం!" గంభీరంగా అనేసి వెళ్ళిపోయాడు శ్రీనాథ్.

* * * *

"ఏంటే బాబూ? ఇంకాసేపట్లో పరీక్ష పెట్టుకొని, ఇంకా తయారవకుండా అలా నిలువు గుడ్లేసుకొని కూర్చున్నావ్?" తులసి అపర్ణ చేతి మీద తడుతూ అడిగింది.

ఏమీ లేదన్నట్లు తలాడించింది అపర్ణ.

అపర్ణ జడ విప్పి, జుట్టు తల మీదకి ముడి వేసుకొంది.

"ఏంటి అపర్ణా, ఇలా పొద్దుటే చిద్విలాసంగా బుద్ధుడి పోజిస్తున్నావ్? కొంపదీసి అర్ధరాత్రేమయినా జ్ఞానోదయమయిందా?" నవ్వుతూ అడిగింది బిందు.


"అబ్బే అలాంటి ప్రమాదమేమీ జరగలేదులే!"

"హమ్మయ్య బతికించావ్! నిద్ర లేచిందగ్గర్నించీ నీ వాలకం చూస్తుంటే, అదను చూసి మమ్మల్ని మంచాలకి కట్టేసి మరీ జ్ఞానభోద చేస్తావేమోననుకొని హడలి చచ్చాననుకో!" బిందు గుండెల మీద చేయి వేసుకొని అంది.

అపర్ణ పక్కున నవ్వింది.

"ఈ అపర్ణ ఎప్పుడు చూసినా చదివినట్టే వుండదు. ఫస్ట్ ఎలా వస్తుందంటావ్ బిందూ?" ఆశ ఆసక్తిగా అడిగింది.

"లేకపోతే అందరికీ మనలా రుబ్బుడు మాస్టార్లుంటారా? ఎంత బుర్రకి అంత తెలివి!" చూపుడు వేలిని నుదుటికి ఆనిస్తూ అంది బిందు.



"ఈ సామెత ఎక్కడో విన్నట్టుగా వుందే?" ఆశ ఆలోచనలో పడ్డట్టుగా అంది.

"అర్నెల్లల్లో వాళ్ళు వీళ్ళవుతారన్నట్లుగా, ఆ సందేహప్రాణితో కలిసి తిరిగి నీకూ డౌట్స్ ఎక్కువ అవుతున్నాయే! పద పద! ఏ ఉప్మాలాంటి పదార్ధమో ఉడకేసి పడేసి వుంటాడు అయ్యరు. ఆలస్యం చేసామా అదీ అందదు." బిందు ఆశని తొందర చేసింది.

"మనకి ప్రాక్టికల్స్‌లో సాల్ట్ ఎనాలిసిస్ బదులు టిఫిన్ ఎనాలిసిస్ పెడితే బావుణ్ణు!" ఆశ సీరియస్‌గా అంటుంటే అపర్ణకు నవ్వొచ్చింది.

"వెళ్ళమాకండే బాబూ, నేనూ వస్తున్నాను." తులసి గబగబ వాళ్ళ దగ్గరకి వచ్చింది.

"అపర్ణా నువ్వు రావట్లేదా?"

"లేదు. మీరెళ్ళండి. నేను స్నానం చేసి వస్తాలే." అపర్ణ నింపాదిగా అంది.

వాళ్ళు వెళ్ళగానే, అపర్ణ గబగబ స్నానం చేసి వచ్చింది. తల దువ్వుకొంటుంటే వార్డెన్ గదిలోకి వచ్చింది.

"హమ్మయ్య! నీ వొక్కదానివే వున్నావా? ఫరవాలేదు. కరెస్పాండెంట్ గారు ఈ పేపర్ నీకిచ్చి రమ్మన్నారు. ఇది చాలా ముఖ్యమైన కాగితమంట. ఎవరికీ చూపించవద్దన్నారు. జాగ్రత్త!" ఆవిడ తలుపు దాకా వెళ్ళి, వెనక్కి తిరిగి అంది. "నీకు టిఫిన్ కూడా రూంకే పంపిస్తాను. నీవు ఆ కాగితాన్ని భద్రంగా చూసుకో!"

ఆవిడ తలుపు దగ్గరకి వేసి వెళ్ళింది.

అపర్ణ ఆశ్చర్యంగా చేతిలోని కాగితం వంక చూసింది.

అది ఆ రోజు జరగబోయే పరీక్ష యొక్క ప్రశ్నాపత్రం!

అపర్ణకు మతిపోయినట్లయింది. కొయ్యబొమ్మలా దాని వంకే చూస్తూ నిల్చుంది. కాగితం మీది అక్షరాలు అలుక్కుపోతున్నట్లనిపించాయి.

"తనను ఎలాగైనా స్టేట్‌ఫస్ట్ వచ్చేట్లు చేస్తామన్నది ఈ పద్ధతిలోనా? తనను వేరుగా, అందరి కన్నా ప్రత్యేకంగా వుంచాలని ప్రయత్నించింది ఇందుకేనా? తన మీద వీళ్ళు పెట్టిన ఈ పెట్టుబడికి, తను వీళ్ళ కాలేజికి అడ్వర్‌టైజింగ్ మోడల్ అవాలా?

అపర్ణ చేతిలోని కాగితాన్ని వుండచుట్టి, చెత్తబుట్టలో వేసింది.

ఇంతలో గదిలోకి కరెస్పాండెంట్ వచ్చాడు. అపర్ణ అతని వైపు మౌనంగా చూసింది.

"నేను పంపించిన కాగితం చదివావా?"

అపర్ణ మాట్లాడలేదు.

"ఎలాగైనా నీకు స్టేట్‌ఫస్ట్ రావాలి. ఇన్విజిలేటర్‌ని కూడా మానేజ్ చేసాను. నీకు ఏ డౌట్ వున్నా నిరభ్యంతరంగా అతన్ని అడిగి రాయి. నేను కూడా రూం బయటే వుంటాను. నీవిక బయలుదేరితే నా కార్లో వెళ్ళొచ్చు."

అపర్ణ మౌనంగానే అతన్ని అనుసరించింది.

* * * *

ఇన్విజిలేటర్ అందరికీ ప్రశ్నాపత్రాలు పంచాడు.

అపర్ణ దానివైపోసారి చూసి, గదంతా కలియజూసింది. అందరూ అప్పటికే రాయడం మొదలు పెట్టారు.

అపర్ణ ఆలోచనలు అటూ ఇటూ పరుగెత్తుతున్నాయి. తను చెత్త బుట్టలోకి విసిరేసిన కాగితం మనసులో మెదిలింది. తన అభిరుచికి వీస మెత్తు విలువీయని అమ్మానాన్న జ్ఞాపకం వచ్చారు. బాధ్యతాయుతమైన స్థాయిలో వుండి భావితరాన్ని జారుడు మెట్లెక్కిస్తున్న కరెస్పాండెంట్ కళ్ళముందు కొచ్చాడు.

పెద్దలు వారి అనుభవంతో సలహాలివ్వవచ్చు. కానీ తమ ఆలోచనలకు విలువనిచ్చి, తమనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోనివ్వరెందుకు?

వారి ఆశల్ని, ఆశయాల్ని నిర్ణయాలుగా మార్చి తమపై బలవంతంగా రుద్దుతారే? వారి నిర్ణయసాధనలో విద్యా విహంగాన్ని వ్యాపార ఇనుప చట్రంలో బిగిస్తున్నారని గ్రహించరే?

స్వచ్ఛందమైన వికాసానికి, సృజనాత్మకతకు తావులేని ఈ సంకుచిత పరిధిలో తాను ఇమడగలదా?

నిరంతరం పోటీని నేర్పి, అసంతృప్తిని రగిల్చి, మిడి మిడి జ్ఞానం మిగిల్చే ఇలాంటి విద్యా విధానాన్ని తాను స్వీకరించగలదా?

విషయ పరిజ్ఞానంతో పనిలేకుండా ఇలా సంపాదించుకున్న ర్యాంకును తాను అంగీకరించగలదా?

అపర్ణ తలెత్తి ఇన్విజిలేటర్ వైపు చూసింది.

అతను గబగబ అపర్ణ దగ్గరకి వచ్చాడు, "ఎనీ ప్రాబ్లెం?" అంటూ.

అపర్ణ మౌనంగా చేతిలోని కాగితాన్ని అతనికి అందించింది.

అయోమయంగా చూస్తోన్న అతనిని దాటుకొని, వరండాలో పచార్లు చేస్తున్న కరెస్పాండెంట్‌ను దాటి, బయటకు నడిచింది.

నివ్వెరపోయి నిలుచుండిపోయిన ఇన్విజిలేటర్ చేతిలోని తెల్ల కాగితాలు రెపరెపలాడాయి. ❑

**హృదయ విదారకరమైన నిజం!**

ఎన్నెన్నో కారణాల వలన కొందరు బలవంతంగా పడుపు వృత్తిలోకి దిగుతారు. కానీ ముఖ్య కారణం దారిద్ర్యమే. 1991-92వ సంవత్సరంలో సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్‌వారు మన దేశంలోని మహా నగరాలలో ఒక సర్వే జరిపారు. బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు, బెంగళూరు, హైదరాబాద్ నగరాలలో నిర్వహించబడిన ఈ సర్వేలో కొన్ని విషాదభరితమైన నిజాలు వెల్లడి అయ్యాయి.

పడుపు వృత్తిలో స్త్రీల సంఖ్య 70 వేలు - లక్షా మధ్యలో వుంది. వారిలో 15 శాతం మంది 15 సంవత్సరాల వయసులోపువారే. 25 శాతం మంది 16-18 సంవత్సరాల మధ్య వయసులో ఈ వృత్తిలో చేరి పొట్ట పోసుకుంటున్నారు. వీరి బ్రతుకు బాగుపడేదెన్నడు?

\- శిరీష